గ్రూప్-1 పరీక్షకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హయత్‌నగర్ డిపో-1 మేనేజర్ విజయ్

హయత్‌నగర్, జూన్ 8 : టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు ఆర్టీసీ హయత్‌నగర్ డిపో-1 నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ జలగం విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. అభ్యర్థులకు సెంటర్ సమాచా రం కోసం హయత్‌నగర్ బస్టాండ్‌లో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. దూర ప్రాంతా లవారు సిటీ బస్సులు, పరీక్ష కేంద్రాలకు వెళ్లే బస్సుల రాకపోకలు గురిం చి ఏమైనా సందేహాలు ఉంటే స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్ప్‌లైన్ నంబర్ : 9700000459ను సంప్రదించాలని తెలిపారు. ఎవరికైనా ప్రత్యేక బస్సులు కావాలంటే 45 మంది ఉన్నట్లయితే ఏర్పాటు చేస్తామని, పూర్తి వివరాల కోసం నం : 9959226138 ,7382826476లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు అందజేత

తెలంగాణ పీసీసీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం కృష్ణానగర్‌లోని ఆదరణ అనాథ శరణాలయంలో విద్యార్థులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకుని.. విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు

– ఎల్బీనగర్ , జూన్ 8

వరదనీరు నిలువకుండా ప్రత్యామ్నాయ చర్యలు

డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య

హయత్‌నగర్ ప్రధాన రహదారిపై మరమ్మతులు ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య

హయత్‌నగర్, జూన్ 8 : వర్షాకాలం దృష్ట్యా హయత్‌నగర్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రోడ్లపై వరదనీరు నిలువకుండా అత్యవసరంగా మరమ్మతులు చేపట్టి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. శనివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సర్కిల్ పరిధిలోని హయత్‌నగర్ రేడియో స్టేషన్ సమీపంలో, పుల్లారెడ్డి స్వీట్ హౌస్, పనామా చౌరస్తా, చింతలకుంట రెయిన్‌బో ఆస్పత్రి, నాగోల్, ఆనంద్‌నగర్, బండ్లగూడ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ విభాగం, శానిటరీ విభాగం అధికారులతో కలిసి ఆయన ప్రధాన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాలకు ప్రధాన రోడ్లపై వర్షపునీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీని నివారణకు ప్రత్యామ్నాయంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు ప్రధాన రోడ్డుపై ఉన్న పాత్ హోల్స్‌ను గుర్తించి సంబంధిత సిబ్బందితో మరమ్మతులు చేయించామని అన్నారు. వర్షాల నేపథ్యంలో వాహనదారులకు, కాలనీల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ ఇంజినింగ్ విభాగం ఈఈ రమేశ్‌బాబు, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ విభాగం ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

స్వర్ణకారులకు చేయూత నివ్వాలి..

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న స్వర్ణకారులు

చంపాపేట, జూన్8 : చేతివృత్తినే నమ్ముకుని బతుకుతున్న స్వర్ణకారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని స్వర్ణకార సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి అన్నారు. ఈ మేరకు శనివారం సంఘం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆభరణాల తయారీలో యంత్రాలతో పోటీపడలేక ఇంటిల్లిపాది పస్తులు ఉండాల్సిన పరిస్థితులు దాపురించాయని తెలిపారు. చేతివృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వమే హక్కున చేర్చుకుని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి గొట్టిముక్కుల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ నిర్మించాలి ..

మన్సూరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కూలిన ప్రహరీను పరిశీలిస్తున్న మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోచబోయిన జగదీశ్‌యాదవ్

మన్సూరాబాద్, జూన్ 8: ఇటీవల కురిసిన వర్షానికి మన్సూరాబాద్ డివిజన్, మన్సూరాబాద్ చౌరస్తాలోని ప్రభుత్వ ప్రాథమిక ప్రహరీ శనివారం కూలిపోయింది. విషయం తెలుసుకున్న డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీష్‌యాదవ్ శనివారం ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 12న పాఠశాలలు పునప్రారంభమయ్యే లోపు ప్రహరీ నిర్మించాల్సి ఉందని తెలిపారు. ప్రహరీ నిర్మాణం విషయాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తానన్నారు. పాఠశాలలోని కరెంట్ మీటరు విద్యార్థులకు అందేవిధంగా ఉందని.. వెంటనే మార్చాలన్నారు.

'ఎన్నికల కోడ్ ముగిసినా ఉచిత కరెంట్ పథకం హామీని నెరవేర్చరా..'

మన్సూరాబాద్, జూన్ 8: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ఉచిత కరెంట్ హామీని నెరవేర్చకుండా తాత్సారం చేస్తుందని ఆరోపిస్తూ శనివారం మన్సూరాబాద్ డివిజన్ వీకర్‌సెక్షన్‌కాలనీకు చెందిన మహిళలు కాలనీలోని కమ్యూనిటీ హాల్ సమీపంలో నిరసన చేపట్టారు. ఎన్నికల కోడ్ ముగిసినా బిల్లులు వస్తున్నాయని.. జీరో బిల్లులను అమలు చేసేందుకు ఇంకా ఎంత కాలం తీసుకుంటారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే 200 యూనిట్లలోపు బిల్లులు వచ్చే వారికి ఉచితంగా కరెంటు సరఫరా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ కోసం ఇంకెన్నాళ్లు వేచి చూడాలని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎలక్షన్స్ వల్ల ఎన్నికల కోడ్ ఉందంటూ ఇన్ని రోజులు చెబుతూవచ్చారని.. ఇప్పుడు ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ తమకు జీరో బిల్లులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ ఇంకా జీరో బిల్లులు రావడం లేదని.. శనివారం రోజున ఇచ్చిన బిల్లులోను తాము కరెంటు బిల్లు కట్టాల్సిన అమౌంట్ వచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని కాలనీవాసులు హెచ్చరించారు.

ఎన్నికల కోడ్ ముగిసినా విద్యుత్ బిల్లులు వస్తున్నాయంటూ బిల్లులను చూపుతున్న మన్సూరాబాద్, వీకర్‌సెక్షన్ కాలనీవాసులు



కక్షిదారులకు కేసు పత్రాలు అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సుజోయ్ పాల్

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సుజోయ్ పాల్

ఆర్కేపురం, జూన్ 8 : ప్రజలు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సుజోయ్ పాల్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి సుజోయల్ పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో సెటిల్ చేసుకోవడం ద్వారా సివిల్ కేసులో చెల్లించిన కోర్టు ఫీజు కూడా తిరిగి పొందవచ్చని తెలిపారు. ఆస్తి పరమైన కేసులు, కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్లు అని అన్నారు. కేసులు పరిష్కారం చేసుకోవడంలో లోక్ అదాలత్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాదబీమా కేసులు, కుటుంబ తగాదా కేసులు, బ్యాంక్ రికవరీ, ఎలక్ట్రిసిటీ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు, ట్రాఫిక్ చలానా కేసులు, టెలిఫోన్ కేసులతో పాటు తదితర కేసులన్నీ కలిపి సుమారు 120000పై చిలుకు కేసులు పరిష్కరింపబడ్డాయన్నారు. అదే విధంగా అన్ని కేసుల్లో కలిపి రూ.58522552ల నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీదేవి, కొండల్‌రెడ్డి, రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

ఎల్బీనగర్ , జూన్ 8 : పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం వివేకానందనగర్‌లో పారిశుద్ధ్య కార్మికులతో కార్పొరేటర్ ప్రేమ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య పనులను సకాలంలో చేపట్టకపోవడంతో కాలనీలు చెత్తతో నిండిపోయాయని, వెంటనే ప్రణాళికాబద్ధంగా చెత్తను తొలగించాలని సూచించారు. కాలనీల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేయాలన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నీలిమ, సూపర్‌వైజర్ బుచ్చయ్య , యాదగిరి, భరత్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి..

ఈనాడు గ్రుపు సంస్థల అధినేత రామోజీరావు బౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, మాగంటి గోపినాథ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, తదితరులు – ఎల్బీనగర్ , జూన్ 8

ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి – మన్సూరాబాద్

ఆకట్టుకున్న శ్రీ విష్ణుమాయ దేవస్థాన శతాబ్ది నృత్యోత్సవాలు

కేరళ తిసూర్‌లోని పెరింగోటుకర శ్రీవిష్ణు దేవస్థానంలో ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లు అందుకున్న శిష్యులతో గురూజీ కోమల్‌బాబు మాడు

చంపాపేట, జూన్8 : కేరళ రాష్ట్రం త్రిసూర్‌లోని పెరింగోటుకర శ్రీవిష్ణుమాయ దేవస్థాన శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇటీవల అక్కడ నిర్వహించిన నృత్యోత్సవాల్లో హైదరాబాద్‌కు చెందిన తమ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం వీక్షకులను ఆకట్టుకున్నట్లు గురూజీ కోమల్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నృత్యోత్సవాల్లో ప్రతిభ కనభరిచిన శిష్యులకు దేవస్థానం అధిపతి డాక్టర్ ఉన్నిస్వామి ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లను అందజేసి సత్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌశిక, వేదాక్షర, భవ్య, యాక్షిక, చైత్ర, మౌనిక, దీక్షిత, యాక్షిక, దుర్గ, కీర్తన, సాయిశృతి, చాయిత్ర, శృతిప్రియాంక, ప్రణవి, సాయితి, అణన్య, మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే పీడీ యాక్టు

రఘునందన్ హెచ్చరిక

కందుకూరు, జూన్ 8 : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తాసీల్దార్ మాచన రఘునందన్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని వివిధ రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాలు ప్రారంభం కాగానే కొంత మంది ఆటోల్లో వచ్చి గ్రామాల్లోని లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించి ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నారని చెప్పారు. లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద సేకరించిన బియ్యాన్ని విక్రయించడం పెద్ద నేరమని పేర్కొన్నారు. బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఆటోలు, దళారులపై నిఘా ఉంచి అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకొని పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

వనస్థలిపురం, జూన్ 8: వర్షాలాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. అగ్రికల్చర్ కాలనీలో చేపట్టిన వర్షపునీటి కాల్వ పనులను ఆమె శనివారం పరిశీలించా రు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో పనులను నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నా రు. ప్రజలు అభివృద్ధి పనులను పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు ఇవ్వడంపై ఆగ్రహం

- చిన్న పిల్లలకు, గర్భిణులకు ఇలాంటివి ఇస్తే ఎలా ..
- అధికారులు చర్యలు తీసుకోవాలి..
- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లను పరిశీలిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 8: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు, గర్భిణులకు కుళ్లిన గుడ్లు ఇవ్వడంపై బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం స్థానిక కార్పొరేటర్ ముత్యాల లలితతో కలిసి మేయర్ సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్ సత్యవతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి కుళ్లిన గుడ్లు సరఫరా చేస్తున్నవారితో మాట్లాడారు. ఏ రోజు గుడ్లు ఆ రోజు ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వాలు ఏవైనా సరే ప్రజల కోసం ప్రవేశ పెట్టిన పథకాలు నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయకూడదన్నారు. ఒక రోజు ఇవ్వవలసిన గుడ్లు ఐదు రోజులకోసారి ఇస్తే ఎలా అని ఆమె ప్రశ్నించారు. గుడ్లు తీసుకునేవారు లేరని, వారు అందుబాటులో ఉండటం లేదని అంగన్‌వాడీ టీచర్ చెప్పడం పట్ల మేయర్ అభ్యంతరం తెలిపారు. చిన్న పిల్లలకు , గర్భిణులకు, బాలెంతలకు ఇస్తున్న పోషక ఆహారంలో ఇలాంటి సంఘటనలు జరగడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గుడ్లు సరఫరా చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పుడు ఎందుకు పరిశీలించడం లేదని సూపర్‌వైజర్‌ను ఫోన్‌లో అడిగారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

చైన్‌స్నాచర్లు అరెస్టు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సునీతా రెడ్డి

బడంగ్‌పేట, జూన్8 : వరస చోరీలకు పాల్పడుతున్న ముఠాను పహాడీషరీఫ్ పోలీసు లు అరెస్టు చేశారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి వివరాలు వెల్లడించారు. మే 24 ఉదయం 8గంటలకు మంఖాల్‌కు చెందిన మహేందర్ భార్య కల్పన.. కూతురు లక్ష్మి ప్రసన్నతో పాటు మరో నలుగురు పిల్లలు శంషాబాద్ సర్వీస్ రోడ్డులో వాకింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వారి కండ్లలో కారపు నీళ్లుచల్లి చైన్ స్నాచింగ్‌కు పా ల్పడ్డారు. కల్పన ఫిర్యాదు మేరకు పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు చైన్ స్నాచర్లను పట్టుకున్నారు. వారినుంచి 8తులాల బంగారం, 30 తులాల వెండి వస్తువులను ,ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే.. పఠాన్‌చెరువులో ద్విచక్ర వాహనం, మహేశ్వరంలోని గొర్ల కాపరి ఇంట్లో కారం నీళ్లు చల్లి బంగారు, వెండి నగలు, కందుకూరు మండలం లాచులూరిలో మహిళ కండ్లలో కారం నీళ్లు చల్లి నగలు తస్కరించారు. వేర్వేరు కేసుల్లో మహారాష్ట్ర నాందేడుకు చెందిన శంశీర్ సింగ్‌ను , నిజామాబాద్‌కు చెందిన దొడ్ల బాబు, గైక్ క్వాడ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, సీఐ గురువారెడ్డి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ కృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రతిభ కనబర్చిన శ్రీత్రివేణి విద్యార్థులకు పురస్కారాలు

ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో శ్రీత్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ కె.గోవర్ధన్ రెడ్డి, ఎడ్యుకేషనల్ మోటివేషనల్ స్పీకర్ మోహన్‌రావు, కాస్మిక్ యోగ థెరపిస్ట్ సంగీత అంకత, తదితరులు

సైదాబాద్, జూన్ 8: శ్రీత్రివేణి విద్యా సంస్థలు చంపాపేట-సరూర్‌నగర్ యాజమాన్యం అందజేసిన పాఠశాల విద్యార్థుల ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం శనివారం చంపాపేటలోని శ్రీరామ ఏసీ ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. పదవ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో పది జీపీఏ సాధించిన 7మంది విద్యార్థులతోపాటు, పాఠశాలలో మొదటి నుంచి 9వ తరగతి వరకు, ప్రతి క్లాస్ నుంచి ఐదుగురు చొప్పున విద్యలో అద్భుత ప్రతిభ కనబర్చిన 60 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రతిభ పురస్కారాలను శ్రీత్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ కె. గోవర్ధన్ రెడ్డి, ఎడ్యుకేషనల్ మోటివేషనల్ స్పీకర్ మోహన్‌రావు, కాస్మిక్ యోగా థెరపిస్ట్ సంగీత అంకత చేతుల మీదుగా అందజేశారు. పది జీపీఏ సాధించిన ఎన్.జస్వంత్‌రెడ్డి, పి.ప్రాణహితారెడ్డి, వి.శృతి, సుహా ఫాతిమా, టి.షారోన్, ఎస్. సిరిచందన, కె.విష్ణువర్ధన్‌లకు ప్రతిభ పురస్కారాల్లో భాగంగా ప్రతి విద్యార్థికి రూ.25వేల చొప్పున నగదుతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషనల్ మోటివేషనల్ స్పీకర్ మోహన్ రావు, కాస్మిక్ యోగ థెరపిస్ట్ సంగీత అంకత మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల ప్రాత కూడా ఎంతో కీలకమన్నారు. శ్రీత్రివేణి విద్యా సంస్థల పాఠశాల డైరెక్టర్ కె. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నూతన విద్యా సంవత్సర అకాడమిక్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి, కొత్త విద్యా సంవత్సరంలో ప్రవేశపెడుతున్న ఫ్రీ ఒలంపియాడ్ ఫౌండేషన్ (నాలుగవ తరగతి, ఐదు తరగతులు), అడ్వాన్స్‌డ్ ఐఐటీ మరియ నీట్ ఫౌండేషన్ కోర్సుల గురించి వివరించారు. ప్రతిభ పురస్కారాలను ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అందజేసి, వారి తల్లిదండ్రులకు శాలువలు కప్పి సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

అంగాళ్ల కుమార్

కందుకూరు, జూన్ 8 : వ్యవసాయ కార్మిక సంఘం గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు, సవాళ్లు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్న మండల కార్యదర్శి అంగాళ్ల కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ..ఈ నెల 10న ఉదయం 10గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కళానిలయంలో నిర్వహించే కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల గ్రామీణ ఉపాధి కార్మికులకు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా ,ప్రజల్లోకి తీసుకువెళ్లడం కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, అఖిల భారత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్, ఎంపీ శివదాసన్, రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు పాల్గొంటారని తెలిపారు. సదస్సుకు వివిధ గ్రామాల నుంచి రావాలని కోరారు.

మాదకద్రవ్యాలు అమ్ముతున్న యువకుడు అరెస్టు

మల్కాజిగిరి, జూన్ 8: గుట్టుచప్పుడు కాకుండా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసిన సంఘటన మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం... లాలాపేట శాంతినగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ముబీన్(25), కొంత కాలంగా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు మెట్టుగూడ నుంచి మల్కాజిగిరికి వచ్చే దారిలో మిర్జాలగూడ మెయిన్ రోడ్డులో ముబీన్ మాదకద్రవ్యాలు విక్రయిస్తుండగా దాడిచేసి పట్టుకున్నారు. అతనిని నుంచి ఎల్ఎస్‌డీ బ్లాట్స్(25) స్వాధీ నం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.